# శాసనమండలి రద్దయ్యే ప్రమాదం

- ఎమ్మెల్యేల్లో మూడోవంతు ఉండాలి
- మండలి సభ్యుల సంఖ్య 40కి తగ్గొద్దు
- 119కి 39 మంది ఉండే అవకాశం
- అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుని రద్దుతో సమస్య
- విభజన చట్టం అమలుతోనే సమస్యకు పరిష్కారం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వెల్లడి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో రమావత్‌నాయక్, లీగల్ సెల్ సభ్యుడు కల్యాణ్, నాయకులు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనమండలి రద్దయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీలోని ఎమ్మెల్యేల సంఖ్యలో మూడోవంతు సభ్యులు శాసనమండలిలో ఉండాలని తెలిపారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం శాసనమండలిలో కనీసం సీట్లు 40 ఉండాలని చెప్పారు. తెలంగాణ శాసనసభలో ఇంతకు ముందు నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేలను కలుపుకొని మొత్తం 120 మంది ఉండేవారు. వీరిలో మూడోవంతు 40 మందితో శాసనమండలిని కొనసాగిస్తున్నారు. కాగా కేంద్రం ప్రభుత్వం గత లోక్‌సభ సమయంలో రాజ్యాంగ సవరణ చేసి అసెంబ్లీలో ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను నామినెట్ చేసే విధానాన్ని తొలగించిందని తెలిపారు. దీంతో తెలంగాణ అసెంబ్లీలో శాసనసభ్యుల సంఖ్య 119కి తగ్గిందన్నారు. ఎమ్మెల్యేల్లో మూడో వంతు మాత్రమే కౌన్సిల్ సభ్యులు ఉండాలన్న నిబంధనల ప్రకారం మండలిలో సభ్యుల సంఖ్య 39కి పడిపోతుందని వివరించారు. మండలిలో కనీసం 40 మంది సభ్యులు ఉండాలనే నిబంధనను ఉల్లఘించినట్టు అవుతుందని అన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు వెళితే వెంటనే మండలి రద్దు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

**అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలి**

తెలంగాణ శాసనమండలి కొనసాగాలంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు భేటీ అవుతున్న నేపథ్యంలో ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్రంలో చంద్రబాబు కీలకంగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెంపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. అసెంబ్లీ సీట్లను పునర్వ్యవస్థీకరించాలని గతంలో కేంద్రాన్ని కోరినా స్పందించలేదని, కుంటిసాకులు చెప్పిందని గుర్తుచేశారు. కానీ జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ సీట్లను పెంచుకున్నారని, కేంద్రానికి ఇష్టం ఉంటే సీట్లను పెంచుకుంటున్నారని తెలిపారు. విభజన చట్టాన్ని అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబుతో మాట్లాడాలని, తద్వారా తెలంగాణ మండలిని కొనసాగించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇరువురు రాష్ట్రాల సీఎంల సమావేశంలో తెలంగాణ ప్రయోజనాల లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడొద్దని సూచించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన విషయంలో గత చరిత్రను పరిశీలించాలని సూచించారు.



## స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయండి

**సీఎంకు హరీశ్‌రావు లేఖ**

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడంలేదని, పారిశుధ్య కార్మికులకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు.

## కవితతో కేటీఆర్, హరీశ్ ములాఖత్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీశ్‌రావు శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ధైర్యం చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉన్నదని, త్వరలోనే బెయిల్ లభిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం సుప్రీంకోర్టులో వేయనున్న బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీలో న్యాయ నిపుణుల బృందంతో కేటీఆర్, హరీశ్‌రావు చర్చించారు.

## కేకే రాజీనామా ఆమోదం

**రాజ్యసభ సెక్రటేరియట్ బులెటిన్ విడుదల**

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : రాజ్యసభ సభ్యత్వానికి కే కేశవరావు చేసిన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదించారు. రాజీనామాను ఆమోదించినట్టుగా రాజ్యసభ సెక్రటేరియట్ శుక్రవారం బులెటిన్ విడుదల చేసింది.

# స్పీకర్ సమయమిచ్చి కలువరా?

- నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు
- ప్రివిలేజ్ మోషన్ నోటీస్ ఇద్దామని వచ్చాం
- రెండు గంటలు వేచిచూసినా స్పీకర్ రాలేదు
- ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, సంజయ్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. అధికారిక హోదా లేకున్నా కాంగ్రెస్ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడానికి తాము టైం అడిగితే శుక్రవారం ఉదయం 11 గంటలకు టైం ఇచ్చారని, కానీ ఆయన అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ రెండు గంటలకుపైగా అసెంబ్లీలో స్పీకర్ కోసం వేచిచూసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ప్రివిలేజ్ మోషన్ ఇవ్వటానికి అపాయింట్‌మెంట్ అడిగితే.. స్పీకర్ తమకు టైం ఇచ్చి మరీ అందుబాటులోకి రాలేదని తెలిపారు. స్పీకర్ మళ్లీ ఎప్పుడు టైం ఇస్తే అప్పుడు కలిసి ప్రివిలేజ్ మోషన్ ఇస్తామన్నారు.

**వారిపై చర్యలు తీసుకొనేవరకు ఊరుకోను: కౌశిక్‌రెడ్డి**

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ తమకు ఉదయం 11 గంటలకు టైం ఇచ్చారని, ఒంటి గంట వరకు ఎదురు చూశామని, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా అందుబాటులోకి రాలేదని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో అధికారులు యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యాశాఖపై రివ్యూ మీటింగ్ పెడితే తనపై క్రిమినల్ కేసు పెట్టారని తెలిపారు. కరీంనగర్ డీఈవో, జడ్పీ సీఈవోపై ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడానికి స్పీకర్‌ను కలవాలని అనుకున్నామని వెల్లడించారు. డీఈవోను సస్పెండ్ చేసే వరకు, జడ్పీసీఈవోపై చర్యలు తీసుకునే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. అధికారుల తీరు వల్ల కల్యాణలక్ష్మి చెక్కులు బౌన్స్ అవుతున్నాయని వాపోయారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కేసులు పెడితే భయపడేవాడిని కాదని, జైలుకు పోవడానికి సిద్ధమేనని తేల్చిచెప్పారు.

**అధికారం ఉందని విర్రవీగొద్దు: కల్వకుంట్ల సంజయ్**

కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కేసీఆర్‌ను తిడితే గొప్ప నాయకుడు కాలేవనే విషయాన్ని తెలుసుకోవాలని చురక అంటించారు. అధికారం ఉన్నదని విర్ర వీగొద్దని, కేసీఆర్ ఉద్యమం చేసినపుడు ఆది శ్రీనివాస్ ఎక్కడున్నారని ప్రశ్నించారు.

# మేం బీఆర్‌ఎస్‌లోనే ఉంటాం

- రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అంతర్గత ఒప్పందం
- కేసీఆర్‌ను దెబ్బ తీయడమే రెండు పార్టీల లక్ష్యం
- బీఆర్‌ఎస్ నాయకుడు పటోళ్ల కార్తీక్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అంతర్గత ఒప్పందంతో పనిచేస్తున్నాయని బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీల లక్ష్యం కేసీఆర్‌ను దెబ్బతియడమేనని స్పష్టంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో చాలా విచిత్రాలు జరుగుతాయన్నారు, బీజేపీ, కాంగ్రెస్ అక్రమ పొత్తు కొనసాగుతున్నదని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి తెలంగాణ సంపదను అమ్మేస్తున్నాయని, సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తున్నాయని, ఈ వేలానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా వెళ్లారని చెప్పారు. కాంగ్రెస్ వేసిన విద్యుత్తు కమిషన్‌కు బీజేపీ మద్దతు పలుకుతూ కేసీఆర్‌ను టార్గెట్ చేశాయని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్‌పై గెలిచిన తుమ్మల నాగేశ్వర్‌రావు ఖమ్మం టీడీపీ ఆఫీస్‌లో గెలుపు సంబురాలు చేసుకున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయనేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో అద్భుతంగా మాట్లాడారని టీడీపీ సోషల్ మీడియా స్పందిస్తున్నదని ఆధారాలను చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ కలిసి పనిచేయాలని రాహులుగాంధీ చెప్పినట్టు తెలుస్తున్నదని అనుమానం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణకు కవచం అని, తెలంగాణ ప్రయోజనాల కోసమే పాటుపడుతుందని స్పష్టంచేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ వ్యవరిస్తుంటే కాంగ్రెస్ వత్తాసు పలుకుతున్నదన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టడం ఖాయమని చెప్పారు. బీజేపీతో బీఆర్‌ఎస్ కలిసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రధాని ప్రమాణస్వీకారానికి రావాలని ఆహ్వానించినా కేసీఆర్ వెళ్లలేదని గుర్తుచేశారు. తాను, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారే ప్రసక్తే లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని మరోసారి స్పష్టం చేశారు.

# అర్ధరాత్రి చీకటి కుట్రలు

మొదటిపేజీ తరువాయి...

చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు. అంతకుముందు.. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన కే కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన మరుసటి రోజే తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. చట్టాన్ని గౌరవించటం తన అభిమతమని, నైతికంగా ఉండటం ధర్మమని తన రాజీనామా సందర్భంగా కేశవరావు ప్రకటించారు. కానీ ఇప్పటివరకు బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు లేదా ఎమ్మెల్సీలు నైతిక బాధ్యతగా తమ పదవులకు రాజీనామా చేయకపోవడం గమనార్హం. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి సీఎం రేవంత్‌రెడ్డి రాత్రి పదకొండు తరువాతే కాంగ్రెస్ కండువా కప్పటం, తాజాగా ఎమ్మెల్సీలు కూడా అర్ధరాత్రి దాటిన తరువాత ఆ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చీకటి రాజకీయాలకు తెరతీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వీరికి నైతికత లేదా?**

పార్టీ మారినందుకే తాను తన ఎంపీ పదవికి రాజీనామా చేశానని కే కేశవరావు ప్రకటించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి, నైతిక విలువలకు గౌరవాన్ని ఇచ్చి తాను ఎంపీ పదవి నుంచి వైదొలగిన నేపథ్యంలో పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇది వర్తించదా? అన్న చర్చ విస్తృతంగా సాగుతున్నది. కేకే రాజీనామా చేసినట్టుగానే పార్టీ మారిన ఎమ్మెల్యేలు కూడా పదవులను వీడి మళ్లీ ఎన్నికల్లో గెలవాల్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది. మరోవైపు త్వరలో మరో ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని, వారిని కూడా రాత్రిపూటే చేర్చుకుంటామని చెప్తున్నారు.








**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును. PUB/0645

దక్షిణ మధ్య రైల్వే, కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో రిటైర్డ్ రైల్వే గెజిటెడ్ ఆఫీసర్స్‌ను నియోగించుటకు ఇండికేటివ్ నోటీస్

వెకెన్సీ నోటీస్ నం. 02/2024,
నం. P.Con SCR/Gaz/Re-Engagement/SCR/C/2024, తేది: 03.07.2024

సేవల అవసరాల నిమిత్తం కాంట్రాక్చువల్ ప్రాతిపదికన చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్/దక్షిణ మధ్య రైల్వే/సికింద్రాబాద్ క్రింద రిటైర్డ్ రైల్వే గెజిటెడ్ ఆఫీసర్స్‌ను నియోగించుట

ఉద్యోగం – కన్సల్టెంట్ – సివిల్ ఇంజినీరింగ్ (సి) & ఎలక్ట్రికల్ (సి) ఖాళీల సంఖ్య : 02 (పొజిషన్స్), ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఒకటి

పూర్తిచేసిన దరఖాస్తును ఎన్వలప్‌లో ఉంచి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్‌స్ట్రక్షన్), గ్రౌండ్ ఫ్లోర్, రైల్ నిర్మాణ్ నిలయంకు ఉప భవనం, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ – 500071 (తెలంగాణ రాష్ట్రం) వారి కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్ వారికి పంపవలెను.

ఎన్వలప్‌పై :APPLICATION FOR THE POSITION OF CONSULTANT - Civil Engineering (C) or Electrical (C) అని వ్రాయవలెను.

అర్హతా, వయస్సు, పారితోషికం, నియామక కాలవ్యవధి, దరఖాస్తు నమూనా మరియు ఇతర వివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inను చూడండి

దరఖాస్తులు 08.08.2024 నాటికి చేరవలెను.

A0821 చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్, సికింద్రాబాద్


## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని మేనేజింగ్ పార్టనర్ **శ్రీ ముత్యాలపాటి విశ్వనాథ్ తండ్రి శ్రీ ముత్యాలపాటి శేషగిరి,** 19 మంది ఇతర వ్యక్తులతో కలిసి వివిధ సేల్ డీడ్స్ ద్వారా 2022, 2023 వ సంవత్సరంలో గండిపేట (మం), కిస్మత్‌పూర్ గ్రామం, సర్వే నంబర్లు 15, 16, 17, 20, 22 మరియు 23లలోని ఎ.4.18 గుంటల విస్తీర్ణం కలిగిన భూమిని కొనుగోలు చేశారు మరియు ఎ.14.14 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి మొత్తంలో ఎ.6.08 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు వివిధ రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ కుదుర్చుకున్నారు మరియు నా క్లయింట్లకు ఎ.14.14 గుంటల మొత్తంలో ఎ.10.25 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి కొరకు సదరు భూమి యజమానుల నుండి స్వాధీనం కూడా బట్వాడా చేయబడినది. షెడ్యూలు ఆస్తిలో కొన్ని అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నవి. ఇటీవల సదరు భూమికి పొరుగు భూమి యజమాని అయిన **శ్రీ ఎల్. సంజీవ రెడ్డి తండ్రి ఎల్.యాది రెడ్డి** అతని భూమి ఎ.3.28 గుంటల విస్తీర్ణంలో వివిధ షెడ్లు నిర్మించారు మరియు ప్రహరీ గోడ కట్టారు మరియు దానిలో గుర్రపు స్వారీ వ్యాపారాన్ని చేస్తున్నారు. వారు నా క్లయింట్‌ను సంప్రదించి అతని భూమి ఎ.3.28 గుంటల భూమిని చాలా అన్యాయమైన ధరకు తీసుకోమని అడిగాడు మరియు లేనిచో నా క్లయింట్‌ను అక్కడ అడుగు కూడా పెట్టనివ్వనని బెదిరించారు మరియు వారి అభివృద్ధి పనులు కొనసాగించబోమని హెచ్చరించారు. **ఎల్. సంజీవ రెడ్డి** చేసిన ప్రతిపాదన తిరస్కరించినందుకు అతను నా క్లయింట్ మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్ వారి అనవసరమైన ఇబ్బందులు కల్గిస్తున్నారు మరియు దాని పరిహారాలతో గౌరవనీయ న్యాయస్థానాల సమక్షంలో ఓఎస్ నం. 886/2023, ఓఎస్ నం. 78/2024, ఓఎస్ నం. 664/2023, మరియు ఓఎస్ నం. 364/2024లతో ఒకటి తర్వాత మరొకటి వివిధ పార్టిషన్ దావాలు దాఖలు చేస్తున్నారు. మేము కూడా న్యాయస్థానాలను ఆశ్రయించాము మరియు వాస్తవిక డాక్యుమెంట్లను పరిశీలించుటకు సంబంధిత డాక్యుమెంట్లు దాఖలు చేశాము. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత గౌరవనీయ న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్‌ను సవరించినది మరియు ఎఫ్ లైన్ పిటిషన్‌తో కొనసాగుటకు అనుమతినిచ్చింది. ఆ ప్రకారంగా **ఎల్ సంజీవ రెడ్డి**తోపాటు అన్ని పార్టీలకు నోటీసు జారీ చేసిన తర్వాత ఎడి సర్వే చేపట్టబడినది, పార్టీల ద్వారా దాఖలు చేయబడిన దరఖాస్తుపై హద్దులతో మొత్తం భూమి విస్తీర్ణం ఎ.14.14 గుంటలు విభజించబడినది. సదరు భూమి విస్తీర్ణం ఎ.3.28 గుంటలు ఇప్పటికే ఎల్ సంజీవ రెడ్డి స్వాధీనంలో ఉన్నదనే విషయం స్పష్టంగా చూపించబడినది మరియు కొలతలు వేయబడినది మరియు భూమి విస్తీర్ణం ఎ.2.29 గుంటలు గుర్తులు పెట్టబడినది మరియు ఓఎస్ నం. 886 ఆఫ్ 2023లో అడ్వకేట్ కమిషనర్ ద్వారా కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉంచబడినది మరియు అందులో గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది మరియు ఎ.1.00 గుంటలు ఎ.2.29 గుంటల మొత్తంలో అడ్వకేట్ కమిషనర్ ద్వారా గుర్తించబడినది మరియు అది అపరిష్కృతంగా ఉన్నది. మిగిలిన ఎ.8.25 గుంటల విస్తీర్ణమునకు సంబంధించి అక్కడ ఎటువంటి వివాదాలు లేవు మరియు పూర్తిగా స్పష్టంగా మా స్వాధీనంలో ఉన్నది, ఇందుకు సంబంధించి గౌరవనీయ న్యాయస్థానం నిషేధపుటుత్తరువు కూడా జారీ చేసినది మరియు అది మా స్వాధీనం క్రింద ఉన్నది మరియు సదరు **ఎల్ సంజీవ రెడ్డి** అక్కడ ప్రతీ విషయంలో జోక్యం చేసుకుంటున్నారు మరియు కొంతమంది అసాంఘిక శక్తులతో కలిసి అక్కడ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గౌరవనీయ న్యాయస్థానం ఉత్తర్వులను అతిక్రమిస్తూ విధేయత లేకుండా సదరు **ఎల్ సంజీవ రెడ్డి అలియాస్ నరసింహారెడ్డి** నా క్లయింట్ **మెసర్స్ అశోకా లీగ్ ప్రాజెక్ట్స్** వారి నుండి సులభంగా డబ్బు తీసుకొనుటకు ప్రయత్నిస్తూ మరియు నా క్లయింట్ పేరును చెడగొట్టుటకు ఎటువంటి వాస్తవాలు లేకుండా వార్తాపత్రికలలో తప్పుడు ప్రచురణలను ఇస్తూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఆ ప్రకారంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు **ఎల్ సంజీవ రెడ్డి** భూమి నా క్లయింట్ ద్వారా కొనుగోలు చేయబడలేదు మరియు అతను అన్యాయమైన ధరకు అతని భూమి విక్రయించుట అతనికి కావాలి కనుక అతను తప్పుడు ప్రకటనలు/ప్రచురణలు వార్తాపత్రికలలో ఇస్తున్నారు. దానికి మేము సదరు **ఎల్ సంజీవ రెడ్డి మరియు ఎల్ సంగారెడ్డి అలియాస్ నరసింహారెడ్డి**లపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నాము.

**తేది: 05.07.2024** సం/- ఎం.శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్, మొబైల్ నం: 8185811456
**ప్రదేశం: రంగారెడ్డి జిల్లా** ఇ-మెయిల్: prataplawfirmtg@gmail.com
అడ్రస్: ప్లాట్ నం.405, 4వ అంతస్తు, సైబర్ శాంతి అపార్ట్‌మెంట్స్, ఆనంద్‌నగర్, బండ్లగూడజాగీర్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ- 500086